క్లుప్తంగా

నేరాలకు పాల్పడితే చర్యలు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గోరంట్ల: ఉపాధి కోసం వచ్చిన ఇతర రాష్ట్రాల కార్మికులు నేరాలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలోని కుబేరాహిల్స్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్న కార్మికులతో డీఎస్పీ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం సీఐ శేఖర్‌. పోలీసు సిబ్బందితో కలసి పోలీసుల సంస్మరణ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



వినోద్‌కుమార్

గోరంట్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన వినోద్‌కుమార్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ హెచ్‌ఎం గోపాల్, పీఈటీ రామ్మోహన్ తెలిపారు. ఈ నెల 21వ తేదీన ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో వినోద్‌కుమార్ పాల్గొంటాడన్నారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన వినోద్‌ను ఉపాధ్యాయులు, మండల ప్రజలు అభినందించారు.

నేడు ప్రజా దర్బార్

మడకశిర: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

విశ్రాంత న్యాయమూర్తి సతీమణి మృతి

మడకశిర: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, విశ్రాంత సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శివలింగేగౌడ్ సతీమణి సిద్దగంగమ్మ (82) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు సిద్దగంగమ్మ భౌతికకాయం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. మృతురాలి భర్త శివలింగేగౌడ్, కుమారుడు డాక్టర్ రవిశంకర్‌ను పరామర్శించారు. అలాగే మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఆమె మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



బాపనకాలువలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం పంచాయతీలోని మరువపల్లి, శెట్టిపల్లి పంచాయతీలోని బాపనకాలువ గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.
రొళ్ల: మండల పరిధిలోని చర్లోపల్లి, బంద్రేపల్లి గ్రామాల్లో ఆదివారం పల్లె పండగను నిర్వహించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన భూమి పూజ చేశారు. మాజీ ఎంపీపీ సిద్దగంగప్ప, కన్వీనర్ దాసిరెడ్డి, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పం క్రాస్ సమీపంలో పావగడ ప్రధాన రోడ్డు వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో అంజినేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సర్పంచ్ గీత, మాజీ సర్పంచ్ మంజునాథ్, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అగళిలో వర్షం



అగళిలో వర్షం కురుస్తున్న దృశ్యం

చిలమత్తూరు/అగళి: చిలమత్తూరు మండలంలో ఆదివారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. మరోవైపు అగళి మండలంలోనూ వర్షం జోరుగా కురిసింది.

ప్రాణాలతో చెలగాటం !



హిందూపురం: చేతికందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, స్విచ్ బోర్డులు



ఆర్టీసీ కాలనీలో స్కూల్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం చుట్టూ తీగలు చుట్టుకొని ప్రమాదకరంగా ఉన్న దృశ్యం



రొద్దం మండలం హౌసింగ్ కాలనీలో ఇంటికి ఆనుకునే ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు

- చేతికందే ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్లు, 11కేవీ విద్యుత్ తీగలు
- వర్షాలు కురిసే వేళలోనూ కన్నెత్తి చూడని ట్రాన్స్‌కో సిబ్బంది
- ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న ప్రజలు

హిందూపురం: పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, వాటి స్విచ్‌బోర్డులు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో కావడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. చాలా చోట్ల స్కూల్ పరిసరాల్లో చిన్నపాటి పిట్టగోడలపై ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పక్కనే స్తంభాలకు స్విచ్ బోర్డులు పెట్టేశారు. చేతికందే ఎత్తులో ఉండటంతో అటుగా స్కూల్‌వెళ్లే విద్యార్థులు, పశువులు ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో వెళ్తే కచ్చితంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అయితే ట్రాన్స్‌కో అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు.

- డీబీ కాలనీ ఎస్‌డీజీఎస్ డిగ్రీ కళాశాల వెనుక ప్రహరీ గోడ దారిలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు మూడు అడుగుల ఎత్తులోనే ఉన్నాయి. వర్షం పడుతుండటంతో ఆ మార్గమంతా బురదమయంగా ఉంది. స్కూల్ పిల్లలతో పాటు ఎవరైనా అటు వైపు సైకిల్, ఇతర వాహనాల్లో వెళ్లి బురదలో జారితే నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై పడే పరిస్థితి ఉంది.
- ఆర్టీసీ కాలనీ వెళ్లేదారి పక్కనే ఉర్దు స్కూల్ ఉంది. స్కూల్ గోడపక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే విద్యుత్తు స్తంభాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోగాయి. తీగలు పెరిగిపోయి స్తంభంపై వరకూ ఎగబాకాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ దిబ్బగా మారింది. వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రమాదకరంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- వన్‌టౌన్ పోలీసుస్టేషన్ రోడ్డు, మేళాపురం దీప్తి స్కూల్, శ్రీకంఠపురం పలు చోట్ల ఇలా పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరమైన ఎత్తులో ఉండటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ కూడా లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి.

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాలనీలో 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదంగా మారాయి. ఇటీవల వైర్లు తెగపడి ఇళ్లలోనే ఫ్రిజ్‌లు, బల్బులు, ఫ్యాన్లు, వాషింగ్ మిషన్లు, వీధి లైట్లు మొత్తం దగ్ధమయ్యాయి. అయిన ట్రాన్స్‌కో అధికారుల్లో చలనం కనిపించడం లేదు. వర్షాలు కురుస్తుండడంతో ప్రమాదం ఎప్పుడు జరుగుతుందోని కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పలు మార్లు ట్రాన్స్‌కో అధికారులు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. 11 కేవీ విద్యుత్ తీగలను కాలనీకి ఏర్పాటు చేసిన ఎల్టీ వైర్లపై వేలాడుతుడటంతో ప్రమాదం జరుగుతుందని వాపోతున్నారు. నివాసపు ఇళ్లపై 11 కేవీ విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో వేళాడుతున్నాయి. ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అక్కడ ప్రమాదం జరిగినా మళ్లీ అదే 11 కేవీ వైర్లకు ఇటులను వేళాడదీసి తాత్కాలిక మరమ్మతు చేశారు. విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉన్న అధికారుల్లో మార్పు రాలేదు. ప్రాణాలు పోయే పరిస్థితి ఉన్నా స్పందించరా? అని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు.



రొద్దంలోని హౌసింగ్ కాలనీలో ఇటీవల వర్షానికి తెగిపడ్డ 11 కేవీ విద్యుత్ వైర్లు

వర్షం వస్తే భయమేస్తోంది



మా ఇంటిపై 11 కేవీ విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేళాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నాం. ఇప్పటికే వైర్లు పలు మార్లు తెగిపడి ప్రమాదాలు జరిగాయి. తెగిన వాటికి అతుకులు వేసి ఇంటిపైనే వేళాడదీశారు. అధికారులు చెప్పినా వారు పట్టించుకోవడం లేదు.

– జాహిదాబాను, హౌసింగ్ కాలనీ, రొద్దం

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోతాయి



హౌసింగ్ కాలనీలో 11 కేవీ విద్యుత్ వైర్లు, ఎల్టీ విద్యుత్ తీగలు ఒకే చోట దగ్గరగా ఉండడంతో ఇటీవల వైర్లు తెగి కిందపడి ఇళ్లలో నష్టం జరిగింది. వాటిని మార్చకుండా మళ్లీ అలాగే వదిలేశారు. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చు. 11 కేవీ విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉండడంతో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. అధికారులు స్పందించి 11 కేవీ విద్యుత్ లైన్ మార్చాలి.

– షఫీవుల్లా, కోఆప్షన్ మెంబర్ , రొద్దం

మా ప్రాణాలు కాపాడండి



మా ఇంటి ముందు 11కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకంగా మారాయి. ఇంటి తలుపు ముందు చేతికందే ఎత్తులో వైర్లు ఉండడంతో నివసించేందుకే భయంగా ఉంది. వర్షం వచ్చినప్పుడు ఎప్పుడు తెగి మీద పడితాయేనని ఆందోళన చెందుతున్నాము. ప్రమాదం జరకముందే సంబంధిత అధికారులు స్పందించి మా ప్రాణాలు కాపాడాలని కోరుతున్నాం.

– ఫక్రుబీ, రొద్దం

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్పార్టన్ అకాడమీ వేదికగా ఆదివారం జిల్లా అండర్–13 ఓపెన్, బాలికల చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 23 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా సెక్రెటరీ నాగార్జున కర్ణాటకం, టోర్నమెంట్ డైరెక్టర్ ఆరీపుల్లాలు మాట్లాడుతూ పోటీలో టాప్–2 క్రీడాకారులు నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకూ తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్–13 ఓపెన్, బాలికల పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఓపెన్ విభాగంలో విజేతలు..

ప్రథమస్థానం:
మహాన్ ఎద్దన్న, 3.5/4 పాయింట్లు

ద్వితీయ స్థానం:
మిథున్ పెద్దన్న, 3.5/4 పాయింట్లు

బాలికలు విభాగంలో విజేతలు

ప్రథమస్థానం: జ్ఞాపిక రెడ్డి, 2/2 పాయింట్లు
రెండవ స్థానం: రుషిత, 2/1 పాయింట్లు.

మూర్ఛ శిబిరానికి స్పందన

హిందూపురం: స్థానిక అల్ హిలాల్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత మూర్ఛ వ్యాధి శిబిరం నిర్వహించారు. 145 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూర్ఛ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ ఈటి రామ్మూర్తి , జేవీవీ సభ్యులు రామకృష్ణ, శ్రీనివాసులు, ఎన్జీఓ సంఘం తాలుకా అధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

వృథా అవుతున్న తాగునీరు



పెద్దకోడిపల్లిలో ప్రభుత్వ తాగునీటి పథకం ట్యాంక్ నుంచి నీరు వృథాగా పోతోంది. ట్యాంక్ నిండిపోయి నీరంతా వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. వృథా నీరంతా పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై పారుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

రొద్దం:

ఇష్టానుసారంగా కొలతలు వేస్తే ఒప్పకోము



మాట్లాడుతున్న రైల్వే రోడ్డు షాపుల బాధితులు

హిందూపురం: పట్టణంలోని రైల్వేరోడ్డును విస్తరిస్తే స్వాగతిస్తామని, అయితే మున్సిపల్ అధికారులు ఇష్టారాజ్యంగా ఆస్తులు ధ్వంసం చేసి తమ కుటుంబాలను వీధుల పాలు చేస్తుంటే ఒప్పుకునేది లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైల్వేరోడ్డు విస్తరణ కోసం ఆస్తులు పోగొట్టుకున్న బాధితులు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ పేరుతో ఇష్టారాజ్యంగ వ్యాపార సముదాయ భవనాలను ధ్వంసం చేసి బాధితులకు తీవ్ర నష్టాలకు గురిస్తున్నారని జేఈ వెంకటస్వామి, నరసోజీ రావు, కౌన్సిలర్ రోషన్ అలీ, షఫీ, వ్యాపారస్తులు పేర్కొన్నారు. గతంలో 70 అడుగులకు కొలతలు వేశారని, తాజాగా 80 అడుగులకు పెంచుతూ ప్రైవేట్ ఆస్తుల ధ్వంసం చేయడం సరికాదన్నారు.

ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రియాజ్



నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సభ్యులు

హిందూపురం టౌన్: జిల్లా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడిగా హిందూపురం పట్టణానికి చెందిన ఎస్.రియాజ్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రైవేటు పాఠశాలల సర్వసభ్య సమావేశం ఆదివారం పెనుకొండలో జరిగింది. నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రియాజ్, ఉపాధ్యక్షుడిగా పీఎస్ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా కొత్తచెరువు ప్రభాకర్, కార్యదర్శిగా గౌస్, కోశాధికారిగా శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా బి.వినూష ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



వినోద్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ: మండల కేంద్రమైన పెనుకొండ పట్టణానికి చెందిన మనోజ్‌కుమార్ (20) శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల వివరాలమేరకు... పెనుకొండ పట్టణం చెరువుగేరికి చెందిన మనోజ్‌కుమార్ శనివారం సాయంత్రం వైజంక్షన్ నుంచి పట్టణంలోకి వస్తుండగా ఆంజనేయస్వామి దేవాలయం సైకిలిస్టును తప్పించబోయి డివైడర్‌ను ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుంచిటి వక్కలిగుల సమావేశం

అమరాపురం: స్థానిక శ్రీసాయి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం కుంచిటి వక్కలిగుల సమావేశం జరిగింది. నవంబర్‌లో వక్కలిగుల ఆరాధ్య దైవం కెంపేగౌడ జయంతి నిర్వహణపై చర్చించినట్లు నాయకులు విశ్వేశ్వర, మంజునాథ, గణేష్, సదానందగౌడ, చంద్రప్ప, త్రిలోక్‌నాథ్ తెలిపారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

మడకశిరరూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి 26 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. 22న బుళ్లసముద్రం, 23న హరేసముద్రం, 24న కల్లుమర్రి, 25న మెళవాయి, 26న ఆమిదాలగొంది గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

మడకశిర: పట్టణంలోని మారుతీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలోని నగదును దొంగలు శనివారం రాత్రి అపహరించారు. ఈ ఘటనపై భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్త సమాచారం

దంపతులకు తీవ్రగాయాలు

రొళ్ల: మడకశిర మండలం కల్లుమర్రి గ్రామ సమీపంలో హిందూపురం వైపు వెళ్లే మలుపు వద్ద 544ఈ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తిమ్మరాజు, లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడ్డారు. హెచ్‌ఎం పల్లికి చెందిన వారు బైక్‌పై హిందూపురం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని హిందూపురం తరలించారు. తిమ్మరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు తీసుకెళ్లారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి టెస్టింగ్ క్యాంపు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తృతీయ సోపాన్, రాజ్యా పురస్కార్ టెస్టింగ్ క్యాంపు కొనసాగుతున్నాయి. ఆదివారం బహిరంగ ప్రదేశాలలో నివాసం ఉండడానికి కావాల్సిన గుడారం ఏర్పాటు చేయడం, ప్రథమ చికిత్సలో భాగంగా అగ్నిప్రమాదాలలో గురైన వారిని కాపాడటం కోసం కావాల్సిన ముడులు వేయడం, నేర్పించారు. హెచ్‌ఎం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గిరిధర్, ఎల్‌టీసీ దారం ప్రసాద్, నాగరాజు, స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు.

తాత్కాలికంగా రోడ్డు పనులు

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం నుంచి రొళ్ల మండల కేంద్రం వైపు ఉన్న ప్రధాన రోడ్డులోని కల్వర్టు వద్ద వర్షానికి రోడ్డు కోతకు గురై గుంతలు పడ్డాయి. ఆదివారం వార్డు మెంబర్ నజ్మామాబు ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో కోతకు గురైన కల్వర్టు, గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు.

23న మండల మీట్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 23 న సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి పేర్కొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.
అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారిని ఉదయమే ప్రత్యేకంగా అలంకరించి భక్తులు తెచ్చిన పూలతో అలంకరించారు. మడకశిర నియోజకవర్గంతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఉషశ్రీచరణ్‌ను కలిసిన నాయకులు



ఉషశ్రీచరణ్‌ను కలిసిన మడకశిర వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆదివారం పెనుకొండలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను కలిశారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆమె సూచించినట్లు నాయకులు తెలిపారు. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదేనని, మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యమని పేర్కొన్నారన్నారు. మడకశిర మండల కన్వీనర్ రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణ్‌రెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు ఉషశ్రీచరణ్‌ను కలిశారు.

శుభకార్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ఇమామ్ వలి కుమార్తె వివాహం ఆదివారం జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. సీనియర్ నాయకులు రమాకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్ పాల్గొన్నారు.
పరిగి: మండలంలో జరిగిన పలు శుభకార్యాలలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. బీరలింగేశ్వరస్వామి ఆలయ కళ్యాణ మండపంలో జరిగిన పెనుకొండ మండలం దుద్దేబండ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి కుమార్తె శ్రావణీరెడ్డి వివాహం ధనుంజయరెడ్డితో జరిగింది. వారిని ఉషశ్రీచరణ్ ఆశీర్వదించారు. అనంతరం శ్రీరంగరాజుపల్లిలోని తిప్పన్న కుటుంబానికి చెందిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖ నిర్వీర్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలు కరువయ్యాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. పేదలకు వైద్య సేవలందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో పేదలకు అన్ని విధాలుగా వైద్య సేవలందేవన్నారు. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల ద్వారా ఇంటింటికీ వైద్య సేవలందించిన ఘనత వైఎస్ జగన్‌దేనని పేర్కొన్నారు. అలాగే108, 104 సేవలు ప్రజలకు సక్రమంగా అందేవని గుర్తు చేశారు. పెనుకొండలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించి ఆదుకున్నారని తెలిపారు. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత వైద్య ఆరోగ్యశాఖ నిర్వీర్యమైందని విమర్శించారు. పేదలకు సకాలంలో వైద్య సేవలందక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ప్రభుత్వపరంగా అందే వైద్య సేవలన్నీ నిలిచిపోయాయని పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సక్రమంగా వైద్య సేవలందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

శుభకార్యం

పట్టణంలోని మల్లినాయకనపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలకృష్ణారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, కుంచిటి వక్కలిగ వైఎస్సార్‌సీపీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

స్కాలర్‌షిప్ మంజూరుకు పరీక్ష

హిందూపురం టౌన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్షలను ఎంజీఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు 228 విద్యార్థులు హాజరయ్యారు. హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ దీన్ దయాళ్ స్పర్శ యోజన మొదటి లెవెల్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిని లెవెల్ 2లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నెలకు రూ.500 ప్రకారం మొత్తం రూ.6 వేల స్కాలర్‌షిప్ రూపంలో అందిస్తామన్నారు.

రెగ్యులర్ చేయాలి

అమరాపురం: డీఎస్సీ–98 ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఉపాధ్యాయులు టీహెచ్.హనుమంతరాయుడు, క్రిష్ణమూర్తి, తిప్పేస్వామి, నరసింహమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు తాము కూడా సమానంగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అయితే తమకు ఎలాంటి టీఏ, డీఏలు వర్తించడం లేదన్నారు. తమను కూడా రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని కోరారు.